నమస్తే తెలంగాణ



# దారి తప్పిన పౌర నేతలు!

**మూగబోయిన ప్రజా ఉద్యమ గొంతుకలు**

**స్పందనారహితంగా పౌరహక్కుల నేతలు**

లగచర్ల గిరిజనులను వేటాడుతున్నా మౌనమే!
మూసీ బాధితుల ఇండ్లు కూల్చేస్తున్నా నిర్లిప్తతే
గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీలు విరిగినా అదే తీరు
పచ్చని పొలాల్లో ఫార్మా పెడుతున్నా పట్టింపులేదు
నాడు గాండ్రించి... నేడు పాలకుల పంచన చేరి..



*హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): వాళ్లు ప్రజాసంఘాల నేతలు.. ప్రశ్నించే గొంతుకలుగా పేరు ప్రఖ్యాతులున్నవారు.. బడుగుల కోసం నినదించినవారు.. గతంలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యమాలు నడిపారు. ప్రజా పోరాటాలు చేశారు.. అదంతా గతం! కానీ, నేడు వారి ధోరణి మారింది. వారి గొంతులు మూగబోతున్నాయి. ఫార్మా కంపెనీల కోసం ప్రభుత్వాలు బలవంతంగా గిరిజనుల భూములను సేకరిస్తుంటే ఒక్క ప్రజాసంఘం నేత కూడా నోరు విప్పడం లేదు. అన్నదాతలు, ఆటోడ్రైవర్లు, మూసీ బాధితుల ఆత్మహత్యలు చేసుకుంటున్నా, లగచర్ల అగ్నిగుండమై మండుతున్నా పెదవి విప్పడంలేదు. వీరిలో కొందరికి సర్కార్ కొలువులు దొరికాయి. మరికొందరు వెయిటింగ్‌లో ఉన్నారనే టాక్ వినిపిస్తున్నది.*

### ఆయన మాటలే బెల్లం

*జాతిబిడ్డల మీద ఆయన మాటలు బెల్లం మూటలు. జాతి కోసమే తన జీవితం అని ప్రసంగాలు దంచుతారు. తన జాతి హక్కుల పోరాట సమితితో గుర్తింపు తెచ్చుకున్నారు.. ఆయన జాతి ఉద్యమాలను విస్మరించలేం గానీ, ఇప్పుడాయనకు సర్కారు కొలువు దొరికింది. బుగ్గకారు జోరు తప్ప బంజారా బిడ్డల గోడు వినిపించడం లేదు. కలెక్టర్ మీద దాడి జరిగిందనే సాకుతో పోలీసులు అర్ధరాత్రి తండాపై దాడులు చేస్తున్నారు. భూములు ఇవ్వాలని గొంతులు పిసికి, కండ్లకు గంతలు కట్టి కొట్టారు. అనుచితంగా ప్రవర్తించారని బంజారాబిడ్డలు గల్లీ నుంచి ఢిల్లీ వెళ్లి గోడు చెప్పుకుంటూ విలపిస్తున్నారు. అయినా ఇప్పటివరకు ఆ ఉద్యమనాయకుడి స్పందనలేదు.*

*లేదు. ఫార్మా విలేజ్ పేరిట రైతుల పంచ ప్రాణమైన భూములను లాగేసుకుంటుంటే, ఫార్మా నిర్వాసితులు ముందుగా ఆయన ఇంటి గడపే తొక్కారట. సహాయం చేయాలని రెండు చేతుల దండం పెట్టి వేడుకున్నా కనికరం కలగలేదని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు.*

### మీ ద్వంద్వ నీతికో.. దండం!

*ఆయనో సీనియర్ ఉద్యమకారుడు. పేరు చివర కులం తోక కత్తిరించుకున్నారు. కానీ, తనువెల్లా కుల ఆధిపత్యమే ఉన్నదనేది ఆయన మీద ఉన్న విమర్శ. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ జేఏసీ నేతగా వ్యవహరించి, ఆ తరువాత రాజకీయ పార్టీ పెట్టుకున్నారు. 2021లో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద భూ నిర్వాసితుల దీక్షకు పిలుపునిచ్చారు. మల్లన్నసాగర్ మాత్రమే కాదు నిమ్జ్, కొండపోచమ్మ సాగర్, సింగరేణి భూ నిర్వాసితుల సమస్యలపై కూడా పోరాటం చేస్తామని ప్రకటించారు. నీటి ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేస్తున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ది నిజాం పాలన అని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 2013 చట్టానికి మించి భూ నిర్వాసితులకు పరిహారం కట్టిస్తుంటే దానిని దాచి పెట్టి ఉద్యమాలు చేశారు. ఇవ్వాళ వికారాబాద్ జిల్లా లగచర్లలో ప్రభుత్వ దాష్టీకం జరుగుతున్నది. భూములు ఇవ్వనందుకు థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలకు గురిచేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. కనీసం వాళ్లను పలకరించి, మీకు మేం అండగా ఉన్నామని చెప్పలేని ఆ నేత తీరుపై మండిపడుతున్నారు లగచర్ల ఫార్మా బాధితులు. 'హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో జరుగుతున్న విధ్వంసాన్ని ప్రశ్నించక పోతివి. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పేరుతో లక్షలాదిమంది నిర్వాసితులు అవుతున్నా పెదవి విప్పక పోతివి. గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేస్తున్నా మౌనం వీడలేదు. రైతాంగానికి ఇంత బువ్వపెట్టే జల ప్రాజెక్టుల బాధితులే నిర్వాసితులు గానీ, ఎవరికీ ఉపయోగం లేని మూసీ ప్రాజెక్టు, లగచర్ల బాధితులు నిర్వాసితులు కాదనుకునే మీ ద్వంద నీతికో దండం' అంటున్నాయి ఆయా బాధిత వర్గాలు.*

### ఆ ధిక్కారి ఎందుకు మొక్కుతున్నడో..!

*మరో నేతది విశిష్ట శైలి. పోరాటమే ఆయన విశిష్టత. బలమైన పౌరహక్కుల ఉద్యమకారుడే. నిన్నటి దాక నిరాడంబర, నిస్వార్థజీవే. ఇన్నాళ్లు రాజ్యాధిక్కారం చేసిన ఆయన.. వృద్ధాప్యంలో పాలకుల పంచన చేరడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశానికి వెళ్లి బస్తర్‌లో కూంబింగ్‌కు మద్దతిస్తామని చెప్పి వచ్చారు. అటువంటి పాలకుడితో ఈ పెద్దమనిషికి సోపతి ఎక్కడిది? మణిపూర్ హింసాకాండ తరహాలో తెలంగాణలోని లగచర్లలో గిరిజనులపై అధికార కాంగ్రెస్, పోలీసుల దమనకాండ సాగుతున్నదని ప్రచారం జరుగుతున్నది. అయినా హక్కుల ఉద్యమ నేతగా ఇప్పటివరకు గిరిజనులకు మద్దతు ప్రకటించకపోవడం పౌర సమాజాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. బస్తర్‌లో ఆదివాసీలు, మూసీలో నిర్వాసితులు, లగచర్లలో ఫార్మా బాధితులు తమ హక్కుల కోసం కొట్లాడుతుంటే వీరు మాత్రం ప్రభుత్వంతో చెట్టపట్టాలేసుకొని సలహాలు ఇవ్వడం కోసం పరితపించడం విమర్శలకు తావిస్తున్నది.*

### సార్..చూస్తున్నారా?

***ఈయన** ఇంకో నిరాడంబర జీవి. వీరిదీ అందే పంథా. ఒడిదుడుకుల్లో ఆత్మవిశ్వాసం నింపే ఆపన్నహస్తమే. ఆదివాసీల హక్కుల అణచివేతను రకరకాల మార్గాల్లో ప్రతిఘటిస్తూ వచ్చిన ప్రొఫెసర్. ఇప్పుడెందుకో రాజ్యం కొలువు మీద మోజు పెరిగినట్టుంది. సర్కారు కొలువు సంపాదించారు. ఇప్పుడాయనకు సర్కారు దాష్టీకాలు కనిపించడం లేదు. స్వరాష్ట్రంలో ఊహకు అందని విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగి, ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడూ సప్పుడు లేదు. పచ్చని పంట పొలాల మధ్య ప్రైవేటు ఫార్మా కోసం పాలకులు పోలీసులను ప్రైవేటు సైన్యంగా మార్చుకొని గిరిజనుల భూములను గుంజుకుంటున్నారు. అయినా పాలకులను నిలదీయకపోవడం విస్మయం కలిగిస్తున్నది.*

### ఇక్కడ 'ఆకులు'చెల్లక..

*'కొత్త పార్టీ పెడతా.. సామాజిక విప్లవం తెస్తా..' అంటూ ఒక అధికారి ఉద్యోగం పోగొట్టుకొన్నారు. ఒక ఫోరం పేరుతో జనంలోకి వచ్చారు. సర్కారుపై పోరాటం చేస్తానన్నారు. ఒక సామాజిక వర్గంపై పేటెంటు హక్కులన్నీ తనవేనని చెప్పుకున్నారు. ఆరు నెలలు తిరగకముందే అన్నీ వదిలేసి పొరుగు రాష్ట్రం వలస పోయారు. అక్కడ భోగభాగ్యాలు అనుభవించారు. అఖరికి అక్కడా ఆకులు చెల్లక మళ్లీ ఇక్కడికే వచ్చారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలంటూ నిరుద్యోగులను రెచ్చగొట్టారు. విద్యకు మెరుగైన నిధుల కోసం ఉద్యమిస్తానని చెప్పుకున్నారు. మూడో కంటికి తెలియకుండా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో రచనా కమిటీలో సభ్యుడిగా చేరారు.. జాబ్ క్యాలెండర్ రాశారు. ఇదే జాబ్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ పత్రికలకు పతాక శీర్షికన ప్రకటనలు ఇచ్చుకున్నది. ఇదే పెద్ద మనిషి మీడియా ముందుకొచ్చి 'జాబ్‌క్యాలెండర్ సూపర్, నిరుద్యోగులు నిరంభ్యంతరంగా నమ్మవచ్చు' అని చిలుక పలుకులు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నది. గుట్టుగా చేసిన సహాయానికి బహుమతిగా ఆయనకు కొత్త సర్కారులో కొలువు దక్కింది. కానీ, ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ లేదు. నాడు నిరుద్యోగుల సమస్యలపై గళమెత్తిన ఆయన నేడు అదే నిరుద్యోగులు చేస్తున్న ధర్నాలు, ఆందోళనల వైపు కూడా చూడటం లేదు.*

### రైతును మింగే స్వరాజ్యం

*రాజకీయ పార్టీలతో అనుబంధం లేదంటారు. 12 ఏండ్ల అనుభవం అని చెప్తారు. కానీ ప్రతి అడుగూ వంచనే. ప్రతి ప్రసంగం మోసమే. రైతు ఎజెండా పేరు మీద పక్కాగా మూడు రంగుల జెండాను మోశారనే ఆరోపణలు ఉన్నాయి. లగచర్ల రైతుల మీద పోలీసు దాడులు, పాలకుల జులుం ప్రదర్శిస్తుంటే కనీసం ఒక్క మాట కూడా మాట్లాడకుండా వీళ్లు ఎక్కడున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 495 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు లెక్కలతో సహా వివరిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సంస్థ పెద్దలు ఒక్కరంటే ఒక్కరు కూడా రైతుల పక్షాన నిలబడి మాట్లాడటం లేదు. కనీసం ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలనైనా పరామర్శించి, వారికి ధైర్యం చెప్పడం లేదు.*

### 'ఫోరం' ఎవరి కోసం..

***అతనో** అగ్రకులం నేత.. తాను బడుగు బలహీనవర్గాల నేతను అని, గుడిసెల సంఘానికి కూడా నాయకుడినని చెప్పుకుంటారు. అవినీతి రహిత పాలన కావాలంటారు. జల ప్రాజెక్టుల లెక్కలు, రైతుబంధు, నిరుపేదల సంక్షేమ పథకాలు, జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలు వద్దని చెప్పే ఆయన.. అధికార మార్పిడి జరిగాక పత్తా లేకుండా పోయారు. టూరిజం కోసం మూసీ సుందరీకరణ మీద రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నా... హైడ్రా పేదల ఇండ్ల మీద పడుతున్నా.. మూసీ బఫర్ జోన్ పేరిట పేదల గుడిసెలను ప్రభుత్వం పీకేస్తున్నా.. వారిని బలవంతంగా తరలిస్తున్నా... కాంట్రాక్టు బిల్లులకు ప్రభుత్వంలోని కొందరు పెద్దలు 10% కమీషన్ ఫిక్స్ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. పంట పొలాల్లో ఫార్మా కంపెనీలు పెట్టేందుకు బలవంతంగా భూములు సేకరిస్తున్నా.. ప్రతి శాఖలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపణలు వస్తున్నా.. స్వయంగా ముఖ్య నాయకుడే శాఖాధిపతులకు టార్గెట్లు పెట్టి వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నా.. ఆ ఫోరం సారు మాత్రం పెదవి విప్పడం లేదు. వ్యవస్థీకృతమైన అవినీతి మీద ఇప్పటివరకు ఒక్క సమావేశం పెట్టలేదు. ఎందుకిలా చేస్తున్నాడని ఆరా తీస్తే.. సర్కార్ ప్రాపకం కోసం గట్టిగానే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది.*




లగచర్ల గ్రామానికి వెళ్లే దారిలో పికెట్ ఏర్పాటు చేసిన పోలీసులు

# లగచర్లలో అర్ధరాత్రి అరాచకం నిజమే!

- సీఎం నియోజకవర్గంలో ఆంక్షలు
- అర్ధరాత్రి కరెంటు తీసి స్త్రీలు, పిల్లల పట్ల అమానుషం
- రైతులపై కేసులను వెనక్కి తీసుకోవాలి
- కంపెనీలు పెట్టొద్దంటే జైలులో వేస్తారా?
- సీఎం అన్న తిరుపతిరెడ్డి అరాచకం
- లగచర్ల గిరిజనులను తరిమేసే ప్లాన్
- తిరుగుబాటుకు కారణాలు వేరే..!
- గ్రామాల్లోకి రాకుండా పోలీస్ పికెట్
- నిగ్గు తేల్చిన ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలో కలెక్టర్‌పై దాడి నెపంతో నవంబర్ 11 అర్ధరాత్రి పోలీసులు సృష్టించిన అరాచకం నిజమేనని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఆర్గనైజేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (ఓపీడీఆర్) తెలిపింది. బాధిత గ్రామాల్లో పర్యటించి వాస్తవాలను నిగ్గుతేల్చింది. ఆ రోజు రాత్రి ఆయా గ్రామాల్లోకి పోలీసులు అర్ధరాత్రి ఒంటి గంటకు చొరబడి, కరెంటు ఆఫ్ చేసి ఒక్కో ఇంటికి 15 నుంచి 20 మంది పోలీసులు పంపినట్టు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నది. పురుషులను విచక్షణ రహితంగా కొట్టి, స్త్రీలు, పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తించి, భయభ్రాంతులకు గురిచేసి భయానక వాతావరణాన్ని సృష్టించారని వివరించింది. కొంతమంది ప్రజలు, రైతులపై అక్రమ కేసులు పెట్టి వారిని జైలుకు పంపగా, మరికొందరు ఊరి బయట తలదాచుకున్నట్టు తెలిపారు. స్త్రీలు, పిల్లలు వృద్ధులు మాత్రమే గ్రామంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని, ఏ అర్ధరాత్రి పోలీసులు తమ ఇంటి మీద దాడి చేస్తారని భయంతో ఒకచోటనే అందరూ పడుకుంటూ తమకు తాముగా ధైర్యం చెప్పుకుంటున్న దీన స్థితి సీఎం సొంత నియోజకవర్గంలో ఉందని ఓపీడీఆర్ ఆవేదన వ్యక్తంచేసింది. దాడులను తక్షణమే ఆపాలని రైతులు, ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది.

### రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి అరాచకం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, ఆర్బీతండా, పోలిపల్లి, పులిచెర్ల, హకీంపేట గ్రామాల్లో ఫార్మా కంపెనీ పెట్టడం కోసం ఆ గ్రామాల రైతుల దగ్గర్నుంచి సుమారు 13 వందల ఎకరాల భూములను సేకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. సీఎం రేవంత్‌రెడ్డి అన్న ఎనుముల తిరుపతిరెడ్డి, ఇక్కడి గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల భూములను కంపెనీకి అప్పజెప్పాలనే ఉద్దేశంతో ఆ మండల తహసీల్దార్, అదనపు జిల్లా కలెక్టర్‌తో కలిసి తొమ్మిది నెలలుగా తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఓపీడీఆర్ తెలిపింది. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ వారి భూములను లాక్కునే ప్రయత్నం చేశారని ప్రజా స్వామ్య పరిరక్షణ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. భూములు కోల్పోతే వారి జీవనోపాధి పోతుందని, వీటికి తోడు తీవ్రమైన అనారోగ్య సమస్యలు, నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం జరుగుతుంది కాబట్టే రైతులు భూములు ఇవ్వలేదని తెలిపారు. ఈ క్రమంలో వారు ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారని, తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్లి తమ గోడును విన్నవించుకుంటే బూటు కాళ్లతో తన్ని, పోలీసుల చేత కొట్టించి భూములు ఇవ్వాల్సిందేనని భయపెట్టి పంపించారని బాధితుల తమకు చెప్పినట్టు పేర్కొన్నారు.

### రైతులను భయపెట్టిన అధికారులు

ఫార్మా బాధిత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణకు తహశీల్దారు, అడిషనల్ కలెక్టర్ వెళ్తే భూములు ఇవ్వబోమని, అక్కడ కంపెనీ పెట్టొద్దని అధికారుల కాళ్లు, చేతులు పట్టుకుని రైతులు బతిమాలారని తెలిపారు. అయితే, అధికారులు 'చూస్తాం. పరిశీలిస్తాం' అని చెప్పి.. తర్వాత రోజున రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకున్నారని జిల్లా అదనపు కలెక్టర్ పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ రైతులను భయపెడుతూ 'ఎక్కడికి వెళ్లినా ఇక్కడికే తిరిగి రావాల్సి వస్తుంది. కాబట్టి మీరు భూములు ఇవ్వాల్సిం దే' అని చెప్పి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని తెలిపారు.

### దాడికి దారితీసిన పరిస్థితులు ఇవే

జిల్లా కలెక్టర్ సమక్షంలో అదనపు కలెక్టర్, తహసీల్దార్, అధికారులు, పోలీసు యంత్రాంగాన్ని తీసుకొని గ్రామాల్లో కాకుండా ఊరి బయట మీటింగ్ ఏర్పాటు చేసి, ప్రజలందరిని పిలిచి వారిని ఒప్పించే ప్రయత్నం చేశారని ఓపీడీఆర్ ప్రతినిధులు తెలిపారు. రైతులు ఆ సమావేశానికి వెళ్లకుండా గ్రామంలోనే ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని, అధికారులు తమ ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని, తాము భూములు ఇచ్చే ప్రసక్తే లేదని భీష్మించుకున్నారని వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే క్రమంలో గతంలో తమ వద్దకు వచ్చిన అదనపు కలెక్టర్, తహసీల్దార్ చేసిన మోసాన్ని ప్రజలు గుర్తు పెట్టుకొని, మళ్లీ వచ్చింది వారేనని, జిల్లా కలెక్టర్ వేరే అని తెలియక కలెక్టర్ 'గో బ్యాక్' అని నినాదాలు చేస్తూ వారిని అక్కడ నుంచి తరిమే ప్రయత్నం చేశారని తెలిపారు. వారందరూ రైతులు కాబట్టి తనపై ఎలాంటి దాడి జరగలేదని కలెక్టర్ చెప్పారని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అక్కడి ప్రజలను రెచ్చగొట్టి కలెక్టర్ పైన దాడి చేయించాయని, ఆ తర్వాత మధ్యరాత్రి ఒంటి గంటకు ఆయా గ్రామాల్లో కరెంటు బంద్ చేసి ప్రతి ఇంటిపై 15 నుంచి 20 మంది పోలీసులు దాడి చేసి పురుషులు, మహిళలు, పిల్లలను లాక్కొచ్చి, యువకులను విచక్షణ రహితంగా కొట్టి, నిర్బంధించి, కేసులు పెట్టారని వివరించారు.

### గ్రామాల్లోకి వెళ్లకుండా పోలీసు కంచెలు

**ఫార్మా** బాధిత గ్రామాల్లోకి ఎవరినీ వెళ్లనీయకుండా చుట్టూ పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశారని ఓపీడీఆర్ సంస్థ వెల్లడించింది. ఆ గ్రామాల్లోని రైతులు, వృద్ధులు తమ గ్రామాలు విడిచి వెళ్లిపోవాలని కోరితే, వెళ్లే ప్రసక్తే లేదంటూ పోలీసులు వారిని కొట్టి పంపిస్తున్నారని కమిటీ సభ్యులు చెప్పారు. తమను కూడా 12 కిలోమీటర్ల దూరంలోనే ఆపి 'మీరు వెళ్లడానికి వీల్లేదు' అని అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. అయినా తాము వెళ్లి బాధితులతో మాట్లాడి, పిల్లలు, వృద్ధులతో చర్చించి ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. కలెక్టర్ సమక్షంలో జరిగిన సంఘటన ఉద్దేశపూర్వకం కాదని, ఈ సంఘటనను ఆధారం చేసుకుని అక్కడి రైతుల పైన, గిరిజనుల పైన పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న దాడులను, దౌర్జన్యాలను తక్షణమే ఆపాలని ఓపీడీఆర్ డిమాండ్ చేసింది. అక్కడి ప్రజల పైన పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

# రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

- 'ఫార్మా' భూసేకరణను రద్దుచేయాలి
- తెలంగాణ సామాజిక కార్యకర్త శ్రీనివాస్
- ఢిల్లీ రాష్ట్రపతి కార్యాయలంలో ఫిర్యాదు




ఫిర్యాదు కాపీని చూపిస్తున్న సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా లగచర్ల పరిసర గ్రామాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటు పేరిట జరుగుతున్న భూసేకరణ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని, దీనికోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు లగచర్ల దుర్ఘటనలపై ఆయన బుధవారం ఢిల్లీలోని రాష్ట్రపతి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దళిత, గిరిజన బలహీనవర్గాల రైతుల భూములను దౌర్జన్యంగా గుంజుకోవడానికి ప్రయత్నిస్తూ.. తిరగబడిన వారిని జైళ్లలో వేస్తున్న దుర్ఘటనలపై రాష్ట్రపతి తక్షణం స్పందించాలని విజ్ఞప్తిచేశారు. లగచర్ల, పరిసర తండాల్లో దాదాపు 1,100 ఎకరాల పేదల సాగు భూములను సేకరించడానికి అక్రమంగా తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్ శివారు ప్రాంతంలో ఫార్మాసిటీ కోసం 12,000 ఎకరాల భూమిని సేకరించి పెట్టిందని, అక్కడ అన్ని వసతులు ఉన్నా.. కేవలం వ్యక్తిగత లాభం కోసం ఫార్మా విలేజ్‌ల పేరుతో వాటిని లగచర్లకు మార్చారని తెలిపారు. పోలీసుల ద్వారా రైతులను బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తూ అధికారుల అక్రమ భూసేకరణకు దిగుతున్నారని తెలిపారు. అర్ధరాత్రి రైతుల ఇండ్లపై దాడులు చేస్తూ, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ అక్రమ అరెస్టులు చేసి జైలులో వేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి బాధిత రైతుల ఇండ్లపైకి వందలాది మంది అసాంఘిక వ్యక్తులను తీసుకెళ్లి 'మీ భూములు ఇవ్వకుంటే, తన్ని తీసుకుంటం' అని బహిరంగంగా ప్రజలను బెదిరిస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, 6 గ్యారెంటీలు అమలు చేయకుండా అనవసరమైన పనులతో ప్రజలను ముఖ్యమంత్రి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. లగచర్లలో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న సీఎంపై, ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# లగచర్లకు వెళ్లకుండా కట్టడి

- పలు సంఘాల నేతల అరెస్ట్



పరిగిలో సేవాలాల్ సేన నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

న్యూస్‌నెట్‌వర్క్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా లగచర్ల బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న పలు సంఘాల నేతలను ఆయా చోట్ల పోలీసులు కట్టడి చేశారు. ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. వికారాబాద్ జిల్లా దోమ మండల సేవాలాల్ సేన నాయకులను మండల పరిధిలోని బుద్లాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య పోలీసులు అరెస్టు చేసి దోమ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, హైదరాబాద్ సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణను పరిగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్, ఎబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, ఓయుజేఏసీ నాయకుడు నెహ్రూనాయక్, రైతుసేన నాయకుడు కిషన్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లను అరెస్ట్ చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### కొనసాగుతున్న తనిఖీలు

లగచర్ల ఘటన తరువాత పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. హైదరాబాద్-బీజాపూర్ హైవేపై అంగడి చిట్టంపల్లి స్టేజీ, మన్నెగూడ పోలీస్ స్టేషన్ ఎదుట చన్గోముల్ పోలీసులు వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. బుధవారం తాండూరు ప్రాంతానికి చెందిన ఓ గిరిజన కుటుంబం హైదరాబాద్‌లో వివాహానికి హాజరై తిరిగి సాయంత్రం ఓ వాహనంలో వస్తున్నారు. హైవే రోడ్డుపై పోలీస్‌స్టేషన్ ఎదుట తనిఖీ చేస్తున్న పోలీసులు వారిని ఆపి స్టేషన్‌లోని తీసుకెళ్లి పూర్తి వివరాలను అడిగి నమోదు చేసుకొని పంపించారు. వికారాబాద్ జిల్లాకు చెందిన గిరిజనులు హైదరాబాద్‌లో ఆయా పార్టీల నేతలు, మానవ హక్కుల పోరాట సంఘాల సభ్యులను కలిసి లగచర్ల ఘటనా విషయాలు వివరించేందుకు వెళ్లారా..? అనే కోణంలో విచారిస్తున్నారు.

## లోకం పోకడ




## అట్రాసిటీ కేసుల్లో 41 సీఆర్పీసీ బెయిల్ ఇవ్వొద్దు

కేంద్ర మంత్రికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ వినతి

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేసేవారిని చట్టపరంగా శిక్షించాలని, వారికి 41 సీఆర్పీసీ కింద బెయిల్ ఇవ్వొద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత శాఖ మంత్రి వీరేంద్రకుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయాలని కోరారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించకుండా, స్టేషన్ బెయిల్ ఇవ్వడం వల్ల.. బాధితులు, సాక్షులపై నిందితులు కేసులను రాజీకోసం బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీంతో చట్టంస్ఫూర్తి నీరుగారి, బాధితులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి వీరేంద్ర కుమార్.. దీనిని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, కుర్సం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్, సెక్రెటరీ పాండదాస్ ఉన్నారు.

## నేడు లగచర్లకు వామపక్షాలు

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామానికి గురువారం వామపక్షాల నిజనిర్ధారణ కమిటీ వెళ్లనున్నది. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం నుంచి ఉదయం 8 గంటలకు ఈ బృందం బయలుదేరి వెళ్లనున్నది. వామపక్షాలకు చెందిన అన్ని పార్టీల రాష్ట్ర నేతలు ఈ కమిటీలో ఉంటారు. సీపీఎం నుంచి తమ్మినేని వీరభద్రం, రమ, సీపీఐ నుంచి బాలమల్లేశ్, న్యూడెమోక్రసీ నుంచి కే గోవర్ధన్, ఎంసీపీఐ నుంచి వనం సుధాకర్, రవి తదితరులు పాల్గొంటారని వామపక్ష నేతలు తెలిపారు. ప్రభుత్వానికి, రైతులకు మధ్య అనుసంధానకర్తగా ఈ కమిటీ వ్యవహరించనున్నదని పేర్కొన్నారు. పోలీసులు అనుమతిస్తే లగచర్లకు వెళ్లి అక్కడి వాస్తవ పరిస్థితులు తెలుసుకొని నిజనిర్ధారణ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించనున్నదని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తామని వారు వెల్లడించారు.

## లంబాడీ నేతల నిర్బంధమే ప్రజాపాలనా?

**ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్**

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి నిర్బంధ పాలన సాగిస్తున్నారని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్రఅధ్యక్షుడు రాంబల్ నాయక్ ఆరోపించారు. లగచర్ల భూ బాధితులకు న్యాయం కోసం పోరాడుతున్న గిరిజన నాయకులను అరెస్ట్ చేయడం రేవంత్‌రెడ్డి అవివేకమని మండిపడ్డారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన చలో లగచర్ల కార్యక్రమానికి బయలుదేరిన నేతలను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా లగచర్ల బాధితుల తరపున పోరాటాలు చేస్తూ ఉంటామని స్పష్టం చేశారు. లగచర్ల భూములను లాక్కోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వెల్లడించారు. అరెస్టయిన వారిలో లక్ష్మణ్‌నాయక్, చందు, లిబియానాయక్, ఏకనాథ్, రాజు, అయోధ్య శ్రీనివాస్, జగన్, మోహన్, బాబు, రాజేందర్, అంబదాస్, భోజ్యానాయక్ తదితరులు ఉన్నారు.



పోలీస్ పహారాలో కొనసాగుతున్న సర్వే పనులు

## పోలీసు పహారాలో సర్వే

పొలాలను తీసుకోవద్దని వేడుకుంటున్న రైతులు

కందుకూరు, నవంబర్ 20: పోలీసు పహారా మధ్య ఫోర్త్‌సిటీ రోడ్డు సర్వే కొనసాగుతున్నది. ఉన్న కాస్త పొలాన్ని రోడ్డు కోసం తీసుకుంటే తామెలా బతకాలని రైతులు వేడుకుంటున్నా అధికారులు వెనక్కి తగ్గడం లేదు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, సీఐ సీతారాంల ఆధ్వర్యంలో అధికారుల బృందం రాచులూరు రెవెన్యూ పరిధిలో సర్వే నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ రోడ్డు కోసం మండల పరిధిలోని లేమూరు, అగర్‌మియాగూడ, రాచులూరు, తిమ్మాపూరు, గాజులబుర్జు తండా, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ గ్రామాల్లోని దాదాపు 1909 మంది రైతులకు చెందిన 441.34ఎకరాల భూమి పోతున్నది. పొలాలు తీసుకుంటే తమకు చావే శరణ్యమంటూ రైతులు.. సర్వేకు వచ్చిన అధికారులు, పోలీసులకు మొరపెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము సర్వే చేపడుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.